4 Journalist dairy
శనివారం
15-08-2026
జర్నలిస్ట్ డైరీ
తెలుగు దినపత్రిక

## ఎంపీ శేషయ్య నగర్ పౌల్ట్రీ కాంప్లెక్స్ లో నిర్వహిస్తున్న ఎంపీ శేషయ్య స్మారక శ్రామిక బడిని సందర్శించిన పాతూరి వెంకటరావు





**రంగారెడ్డి జిల్లా బ్యూరో, ఆగస్టు 14 (జర్నలిస్ట్ డైరీ) :** షాద్ నగర్ మున్సిపాలిటీ 5 వ వార్డు పరిధిలో గల ఎంపీ శేషయ్య నగర్ పౌల్ట్రీ కాంప్లెక్స్ లో కార్మిక నేత పినపాక ప్రభాకర్ సహకారంతో పనిచేస్తున్న కార్మికుల పిల్లలను బడి బాట కార్యక్రమంలో మండల విద్యాశాఖ అధికారి మనోహర్ పౌల్ట్రీ కాంప్లెక్స్ లో విస్తృతంగా పర్యటించి సుమారు 70 మంది పిల్లలను గుర్తించడం జరిగింది. అనంతరం పౌల్ట్రీ పారిశ్రామిక వేత్త పాతూరి వెంకటరావు ఆర్థిక సహకారంతో పిల్లలకు పుస్తకాలు , బ్యాగులు, వాటర్ బాటిల్స్ అందించి స్వయంగా ఒక విద్యా వాలంటీర్ ను నియమించి ఆ పిల్లలకు కమ్యూనిటీ హాల్ లోనే శ్రామిక బడిని స్థాపించి గత రెండు నెలలుగా కార్మికుల పిల్లలకు విద్యను అందిస్తున్నారు... ప్రభుత్వం తరుపున ఒక ఉపాధ్యాయుడిని, పౌల్ట్రీ రైతుల సహకారంతో ఒక విద్యా వాలంటీర్ ను నియమించగా మధ్యాహ్నం భోజనం ఏర్పాటు తో నిరంతరాయంగా ఈ శ్రామిక బడి నడుస్తుంది. ఈ ఎంపీ శేషయ్య స్మారక శ్రామిక బడి ని ప్రముఖ పౌల్ట్రీ పారిశ్రామిక వేత్త పాతూరి వెంకటరావు సందర్శించి పిల్లలకు ఇంకా ఏమైన సదుపాయాలు కావాలా అని అక్కడ ఉన్న ఉపాధ్యాయులను అడిగి తెలుసుకున్నారు. అలానే పిల్లలకు ఏర్పాటు చేసిన మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించారు. ఉపాధ్యాయుల సూచన మేరకు పిల్లలకు హిందీ పాఠ్య పుస్తకాలు అందించాలని కోరగా దానికి సానుకూలంగా స్పందించిన పాతూరి వెంకటరావు. ఈ కార్యక్రమంలో కార్మిక నేత పినపాక ప్రభాకర్, పౌల్ట్రీ రైతులు కొర్రపాటి శ్రీనివాస రావు, బండారుపల్లి నాగేశ్వర రావు, శివ మోహన రావు, మండవ మురళి, నువ్వుల నాగేశ్వర రావు, నాగ మల్లేశ్వర రావు, గుదె శ్రీకాంత్ మరియు ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## ఫరూక్‌నగర్ సింగిల్ విండో నూతన పాలకవర్గం బాధ్యతలు స్వీకరణ

**-చైర్మన్‌గా చల్లా శ్రీకాంత్ రెడ్డి.. వైస్ చైర్మన్‌గా తుపాకుల శేఖర్**

**-నూతన పాలకవర్గం అధికారికంగా బాధ్యతలు స్వీకరణ**



**రంగారెడ్డి జిల్లా బ్యూరో, ఆగస్టు 14 (జర్నలిస్ట్ డైరీ) :** ఫరూక్‌నగర్ మండల ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం (పిఎసిఎస్)కు నూతన పాలకవర్గం ఏర్పడింది. సింగిల్ విండో చైర్మన్‌గా సీనియర్ కాంగ్రెస్ నాయకులు చల్లా శ్రీకాంత్ రెడ్డి, వైస్ చైర్మన్‌గా తుపాకుల శేఖర్ ఎంపికయ్యారు. నూతనంగా ఎంపికైన చైర్మన్, వైస్ చైర్మన్‌తో పాటు డైరెక్టర్లు గురువారం షాద్‌నగర్‌లోని పిఎసిఎస్ కార్యాలయంలో అధికారికంగా బాధ్యతలు స్వీకరించారు. డైరెక్టర్లుగా నాగి సాయిలు, జి. వినాయక్, ఎస్. లక్ష్మీకాంత్ రెడ్డి, లింగారం అమృత యాదయ్య, సి. రత్నమ్మ పెంటయ్య, ఎల్. రఘుగౌడ్, సి. శ్రీధర్ రెడ్డి, అంబటి విజయ్ కుమార్, దాస్య నాయక్, హైదర్ గోరి, వి. రాజేందర్ రెడ్డి తదితరులు నియమితులయ్యారు. దీంతో ఫరూక్‌నగర్ మండల సింగిల్ విండోకు నూతన పాలకవర్గం కొలువుదీరింది. అసిస్టెంట్ రిజిస్ట్రార్ సి. సరస్వతమ్మ ఆధ్వర్యంలో నూతన పాలకవర్గం బాధ్యతలు స్వీకరించింది. ఈ సందర్భంగా చైర్మన్ చల్లా శ్రీకాంత్ రెడ్డి మాట్లాడుతూ తనపై నమ్మకం ఉంచి ఈ బాధ్యతలు అప్పగించిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, షాద్‌నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్, మాజీ ఎమ్మెల్యే ప్రతాప్ రెడ్డి, మాజీ జడ్పీటీసీ శ్యామ్ సుందర్ రెడ్డికి ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.రైతుల సంక్షేమమే లక్ష్యంగా పిఎసిఎస్ ద్వారా రైతులకు మరిన్ని సేవలు అందించేందుకు కృషి చేస్తామని ఆయన తెలిపారు. రైతులకు అందుబాటులో ఉంటూ సహకార సంఘాన్ని మరింత అభివృద్ధి చేసేలా నూతన పాలకవర్గం సమష్టిగా పనిచేస్తుందని పేర్కొన్నారు.నూతన పాలకవర్గం బాధ్యతలు స్వీకరించిన సందర్భంగా కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు వారికి శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో పిఎసిఎస్ సెక్రటరీ కె. రఘునందన్, కంప్యూటర్ ఆపరేటర్ ఎం. రమాదేవి, సిబ్బంది ఏ. బ్రహ్మం, పి. జంగయ్య, బి. హరికృష్ణ, ఎం.డి. అన్వర్ తదితరులు పాల్గొన్నారు.

## సిద్దాపూర్ డంప్‌యార్డు జీవో 641ను రద్దు చేయాలి

**– ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి సామాజికవేత్త వంగూరి గంగిరెడ్డి విజ్ఞప్తి**





వంగూరి గంగి రెడ్డి

**రంగారెడ్డి జిల్లా బ్యూరో, ఆగస్టు 14 (జర్నలిస్ట్ డైరీ) :** సిద్ధాపూర్‌లో డంప్‌యార్డు ఏర్పాటుకు సంబంధించిన జీవో 641ను వెంటనే రద్దు చేయాలని కోరుతూ సామాజికవేత్త, సిద్ధాపూర్ డంప్‌యార్డు వ్యతిరేక జేఏసీ సలహాదారు వంగూరి గంగిరెడ్డి ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి 'ఎక్స్' (ట్విట్టర్) వేదికగా విజ్ఞప్తి చేశారు.సిద్ధాపూర్ పరిసర ప్రాంతాల్లో ఇప్పటికే అనేక పరిశ్రమలు ఉండటంతో కాలుష్య సమస్య తీవ్రంగా ఉందని ఆయన పేర్కొన్నారు. డంప్‌యార్డు ఏర్పాటు వల్ల సమీపంలోని గ్రామాలు, తండాలకు చెందిన సుమారు 50 ప్రాంతాల ప్రజలు ప్రభావితమయ్యే అవకాశం ఉందని తెలిపారు. ఈ ప్రాంతం పాలు, కూరగాయల ఉత్పత్తికి కీలక కేంద్రంగా ఉందని, పచ్చని పంట పొలాలు దెబ్బతినే ప్రమాదం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. మత సామరస్యానికి ప్రతీకగా నిలిచిన జాంగీర్‌పీర్ దర్గా సహా అనేక ఆధ్యాత్మిక క్షేత్రాలు ఈ ప్రాంతంలో ఉన్నాయని, డంప్‌యార్డు వల్ల వాటి పరిసరాలపై కూడా ప్రతికూల ప్రభావం పడే అవకాశం ఉందన్నారు. పశు సంపదకు ఇబ్బందులు తలెత్తడంతో పాటు, గొలుసుకట్టు చెరువుల ద్వారా హిమాయత్‌సాగర్‌పై ప్రభావం పడే ప్రమాదం ఉందని పేర్కొన్నారు. మూసీ నది కలుషితమయ్యే అవకాశం ఉందని, భూగర్భ గ్యాస్ లైన్ కు కూడా ప్రమాదం పొంచి ఉందని తెలిపారు. అంతేకాకుండా విమానాశ్రయం సమీపంలో డంప్‌యార్డు ఏర్పాటు చేస్తే పక్షుల సంఖ్య పెరిగి బర్డ్‌స్ట్రైక్ ప్రమాదం తలెత్తే అవకాశం ఉందని గంగిరెడ్డి ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లారు. ప్రజల ఆరోగ్యం, పర్యావరణం, వ్యవసాయం, పశుసంపద, నీటి వనరులు, మతసామరస్యాన్ని దృష్టిలో పెట్టుకుని జీవో 641ను పునఃపరిశీలించి వెంటనే విరమించుకోవాలని ఆయన కోరారు.

## సర్వేలపై అంత ఉలికిపాటు దేనికి..!?

**-సోషల్ మీడియా సంస్థలు సర్వేలు చేస్తే మాకేం సంబంధం**

**-అధికారం కోసం అర్రులు చేస్తుంది మీరు. మేం కాదు..**

**-బీఆర్ఎస్ పట్టణ ప్రధాన కార్యదర్శి "చీపిరి రవి యాదవ్"**



**రంగారెడ్డి జిల్లా బ్యూరో, ఆగస్టు 14 (జర్నలిస్ట్ డైరీ) :** సోషల్ మీడియాలో టిఆర్ఎస్ పార్టీకి అనుకూలంగా వస్తున్న కొన్ని సంస్థల సర్వేలకు అధికార కాంగ్రెస్, బిజెపి పార్టీల నాయకులు ఉలికి పడుతున్నారని వాస్తవాలు జీర్ణించుకోలేని పరిస్థితుల్లో ఉన్నారంటూ బీఆర్ఎస్ పట్టణ ప్రధాన కార్యదర్శి చీపిరి రవి యాదవ్ విమర్శలు వ్యక్తం చేశారు. కొన్ని యూట్యూబ్ ఇన్స్టాగ్రామ్ ఇతర సంస్థలు రాష్ట్రంలో జరగబోయే భవిష్యత్ పరిణామాలు ఇతర అంశాలను కులం కుశంగా పరిశీలించి సదరు సంస్థలు కొన్ని ఫలితాలను సోషల్ మీడియాలో విడుదల చేశారని వాటిని మీడియా సంస్థలు స్వీకరించి వార్తలుగా మలిచారని, ఇందులో బిఆర్ఎస్ పార్టీ ప్రమేయం ఎంత మాత్రం లేదని చీపిరి రవి యాదవ్ స్పష్టం చేశారు. వాస్తవాలు చూసి ఆత్మ పరిశీలన చేసుకోవాల్సింది పోయి కూర్చుకోలేక తమపై నిందారోపణలు చేయడం అధికార కాంగ్రెస్ పార్టీ నాయకులకు భారతీయ జనతా పార్టీ నాయకులకు ఎంత మాత్రం తగదని చీపిరి రవి యాదవ్ హితవు పలికారు. రాష్ట్రంలో అనేక సర్వే సంస్థలు యూట్యూబ్ ఇన్స్టాగ్రామ్ నిర్వాహకులు ఎంతోమంది ఎన్నో రకాలుగా నియోజకవర్గాల వారిగా సర్వేలు చేస్తుంటారని వాటిని సోషల్ మీడియాలో పెడుతుంటారని అంతేతప్ప తామేమి సర్వేలు చేయించుకోలేదని బిజెపి నాయకుడు పాలమూరు విష్ణువర్ధన్ రెడ్డి గుర్తించాలన్నారు. గతంలో అసెంబ్లీ ఎన్నికలకు ముందు ఎవరు సర్వేలు చేయించుకున్నారు ప్రజలకు మీడియా సంస్థలకు తెలుసని కొత్తగా చెప్పనక్కర్లేదని ప్రజల్లో కాంగ్రెస్ బిజెపి పార్టీలకు తగ్గుతున్న ఆదరణ చూసి వాటిని కవర్ చేసుకునేందుకు బిఆర్ఎస్ పార్టీని వారు విమర్శిస్తున్నారని స్పష్టం చేశారు. ఎవరిని విమర్శలు చేసిన చివరకు వచ్చే ఎన్నికల్లో "గులాబీ" గుభాలించక తప్పదు, "కమలం" వాడిపోక తప్పదు, "చేయి" విరిగిపోక తప్పదని చీపిరి రవి యాదవ్ జోస్యం చెప్పారు. తెలంగాణలో అధికారం కోసం బిజెపి అర్రులు చాస్తుందని విమర్శలు చేశారు.

## ఫూలే దంపతుల విగ్రహాలను ఆవిష్కరించిన సీఎం రేవంత్ రెడ్డి

**- హాజరైన ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్**





**తెలంగాణ బ్యూరో, ఆగస్ట్ 14 (జర్నలిస్ట్ డైరీ) :** హైదరాబాద్‌లోని నెక్లెస్ రోడ్ ఐమ్యాక్స్ సర్కిల్ ఎదురుగా హెచ్ఎండీఏ గ్రౌండ్స్‌లో, డాక్టర్ బీఆర్ అంబేద్కర్ విగ్రహం సమీపంలో ఏర్పాటు చేసిన మహాత్మా జ్యోతిబా ఫూలే, సావిత్రిబాయి ఫూలే దంపతుల విగ్రహాలను తెలంగాణ ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో షాద్‌నగర్ ఎమ్మెల్యే, ప్రభుత్వ రంగ సంస్థల కమిటీ చైర్మన్ వీర్లపల్లి శంకర్ పాల్గొన్నారు. పీసీసీ అధ్యక్షుడు మహేష్ గౌడ్, మంత్రులు వాకిటి శ్రీహరి, పొన్నం ప్రభాకర్, కొండా సురేఖ, ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్, ఎంపీలు అనిల్ కుమార్ యాదవ్, ఆర్. కృష్ణయ్య, సురేష్ షెట్కర్, ఎమ్మెల్యేలు దానం నాగేందర్, నవీన్ యాదవ్, మందుల సామేల్, మక్కన్ సింగ్ రాజ్ ఠాగూర్, ప్రభుత్వ సలహాదారు వి. హనుమంతరావు, మాజీ ఎంపీ అంజన్ కుమార్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.సామాజిక సమానత్వం, విద్య, మహిళా సాధికారత కోసం విశేష కృషి చేసిన మహాత్మా జ్యోతిబా ఫూలే, సావిత్రిబాయి ఫూలే దంపతుల సేవలను ఈ సందర్భంగా పలువురు నాయకులు స్మరించుకున్నారు.

## ప్రజా చైతన్య యాత్రను జయప్రదం చేయండి బుద్ధుల జంగయ్య



**రంగారెడ్డి జిల్లా బ్యూరో, ఆగస్ట్ 14 (జర్నలిస్ట్ డైరీ) :** కేంద్రంలో బిజెపి నరేంద్ర మోడీ ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలను విధానాలను నీరసిస్తూ ప్రజా చైతన్య యాత్ర నిర్వహిస్తున్నామని సిపిఐ రాష్ట్ర సమితి సభ్యులు బుద్దుల జంగయ్య అన్నారు ఈ సందర్భంగా ప్రజా చైతన్య యాత్రకు సంబంధించిన గోడ పత్రిక కొందుర్గు బస్టాండ్ ఆవరణలో విడుదల చేశారు ఈ కార్యక్రమానికి విచ్చేసి ఆయన మాట్లాడుతు కేంద్రంలో బిజెపి నరేంద్ర మోడీ ప్రభుత్వం ప్రజా వ్యతిరేక విధానాల అవలంబిస్తూ పాలన సాగిస్తుందని ఆయన ఆరోపించారు

ఎన్నికల ముందు ఇచ్చిన హామీల నెరవేర్చలేక ధరల మీద ధరలు పెంచి ప్రజల నెత్తిపై మోపి ఇష్టానుసారగా వ్యవహరిస్తుందని ఆయన దుయబట్టారు నల్లధనాన్ని తీసుకువచ్చి ప్రతి పేదవారి అకౌంట్లో 15 లక్షలు చేస్తామన్న నరేంద్ర మోడీ ఒక్క రూపాయి నల్లధనాన్ని కూడా దీనికి తీసుకురాలేక పొగ అవినీతిపరులను నీరం మోదీ విజయ్ మాల్యా లాంటి బ్యాంకులను మోసగించిన సీటర్సు దేశం నుంచి తప్పించి విదేశాలకు పంపించిన ఘనత ప్రధానమంత్రి నరేంద్ర మోడీకే దక్కిందన్నారు

ప్రజలు బిజెపి ప్రభుత్వం పై వ్యతిరేకంగా ఉద్యమించి సందర్భం వచ్చినప్పుడు జాతీయవాదం కులం మతం పేరుతో ప్రజలను చల్లబరుస్తున్నారు యువత తిరగబాటు కాక్రోచ్ జనతపార్టి రూపంలో స్పష్టంగా అర్థమైందని భవిష్యత్తులో మరిన్ని ఉద్యమాలు బిజెపి ప్రభుత్వం పై చేయాల్సిన అవసరం ఉందని ఆయన తెలియజేశారు సర్ పేరా ఎస్సీ ఎస్టీ మైనార్టీల ఓట్లు తొలగిస్తున్నారు ఇప్పటికే 73 లక్షల ఓట్లు ఒక్క తెలంగాణ రాష్ట్రంలోనే తొలగించారు 18 సంవత్సరాలు నిండిన యువత దేశంలో ఎంతమంది ఉన్నారు తెలంగాణ రాష్ట్రంలో ఎంతమంది ఉన్నారు వాళ్ళందరికీ ఓటు హక్కు ఎందుకు కల్పిస్తలేరు ప్రధానమంత్రి నరేంద్రమోడీ ప్రభుత్వం సమాధానం చెప్పాలన్నారు విత్తనాల పేర పెట్రోల్ డీజిల్ భారీ కుంభకోణానికి తెరలేపింది కేంద్ర నరేంద్ర మోడీ ప్రభుత్వం అని నిజాయితీ గురించి చెప్పుకునే నరేంద్ర మోడీ పెట్రోల్ డీజిల్ గ్యాస్ ధరలు ఎందుకు తగ్గిస్తలేరు అని ఆయన ప్రశ్నించారు వెంటనే పెంచిన ధరలను అదుపు చేయాలని ఆయన డిమాండ్ చేశారు అందుకే కేంద్ర ప్రభుత్వ విధానాలను నిరసిస్తూ ఈ నెల 17 నుంచి 21 వరకు రంగారెడ్డి జిల్లాలో ప్రజా చైతన్య ప్రచార యాత్రను నిర్వహిస్తుందని ఈ ప్రచార యాత్ర 19వ తేదీన కొందుర్గు మండలానికి రాబోతుంది అధిక సంఖ్యలో ప్రజానీకం పాల్గొని ఈ యాత్రను జయప్రదం చేయాలని ఆయన కోరారు ఈ కార్యక్రమంలో సిపిఐ మండల సహాయ కార్యదర్శి కే యామిని సిపిఐ మండల కార్యవర్గ సభ్యులు గోపి గడ్డ యాదయ్య సిపిఐ నాయకులు రాములు మల్లయ్య రమేష్ మొగులయ్య ఏఐటియుసి మండల నాయకులు

బి యాదయ్య బి కేఎంయు నాయకులు తదితరులు పాల్గొన్నారు

